## క్లుప్తంగా

### వీరులపాడు ఎంపీడీవోగా రూపవతి

వీరులపాడు: వీరులపాడు మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా రూపవతి గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల అభివృద్ధితో పాటు ఆయా గ్రామాల్లోని ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బాధ్యతలు చేపట్టిన ఆమెకు ఎంపీపీ కోటేరు లక్ష్మీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఏవో రాజు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### ఫీల్డ్ అసిస్టెంట్‌పై మరోసారి విచారణ



చిల్లకల్లు(జగ్గయ్యపేట): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సస్పెండ్ అయిన మండలంలోని పోచంపల్లి గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్‌పై మరోసారి ఏపీడీ పార్థసారధి విచారణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫీల్డ్ అసిస్టెంట్ బంక అంబేడ్కర్ తను పని చేసిన సమయంలో మస్టర్లలో అవకతవకలు జరిగాయని గ్రామానికి చెందిన కామిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఈ నెల 8వ తేదీన పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. దీంతో జిల్లా అధికారుల ఆదేశాల మేరకు కూలీలను, గ్రామస్తులను కార్యాలయంలో విచారణ చేసినట్లు చెప్పారు. నివేదికను అధికారులకు అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీవో రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై అవగాహన అవసరం

నందిగామ రూరల్: కిశోర బాలికలు గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ నెలకుదిటి శిరీష, వైద్యాధికారి గౌతమి పేర్కొన్నారు. 'స్వస్థ్ నారీ – సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మండలంలోని లింగాలపాడు, గోళ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని కేతవీరునిపాడు, రాఘవాపురం గ్రామాల్లోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో గురువారం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించారు. దీనిలో భాగంగా బీపీ, షుగర్, ఓరల్ క్యాన్సర్, బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ లక్షణాలతో పాటు మహిళల ఆరోగ్యంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు, పాన్ మసాలా, గుట్కా వంటి వాటిని వాడటం వల్ల పురుషుల్లో నోటి, ఊపిరితిత్తుల క్యాన్సర్ వచ్చే ప్రమాదముందని చెప్పారు. మహిళలు, కిశోర బాలికల్లో రక్తహీనత లోపాన్ని గుర్తించి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యారోగ్య సిబ్బంది బిక్షాలు, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సరోజిని, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకట్రావమ్మ, సీహెచ్‌వో కీర్తి, ఏఎన్ఎం గౌరీశంకరి, పద్మ, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

### కర్రి శేషగిరిరావుకు సన్మానం



జగ్గయ్యపేట అర్బన్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా నియమితులైన జగ్గయ్యపేట పట్టణానికి చెందిన కర్రి శేషగిరిరావు(చిన్నా)ను పేట పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం, స్వర్ణకారుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తూమాటి కృష్ణమాచారి, స్వర్ణకారుల సంఘం, విశ్వబ్రాహ్మణుల సంఘాల నేతలు ఉల్లి రామకృష్ణాచారి, పిన్నెల్లి జ్వాలా నరసింహ, సయ్యద్ మస్తాన్, మామిళ్లపల్లి వెంకట రమణాచారి, అమలాపురపు వాసు, సుంకర సతీష్, ఆలూరి శశి, నాని, శిరసనగండ్ల విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### పని చేయని వాహనమిత్ర సర్వర్

**రెండు రోజులుగా సైట్ ఓపెన్‌కాక ఆటో డ్రైవర్ల ఇక్కట్లు**

జగ్గయ్యపేట: వాహనమిత్ర పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి సైట్ ఓపెన్ కాకపోవడంతో ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం విజయదశమి పండుగ సందర్భంగా ఆటో డ్రైవర్లకు రూ.15వేలు ఇస్తుండటంతో నియోజకవర్గంలోని జగ్గయ్యపేట, పెనుగంచిప్రోలు, వత్సవాయి మండలాల్లోని లబ్ధిదారులు రెండు రోజులుగా సైట్ ఓపెన్ కాకపోవడంతో సచివాలయాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. దరఖాస్తుకు ఆఖరి తేదీ ఈ నెల 19 కావడంతో ఆటో డ్రైవర్లు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలల తర్వాత వాహనమిత్రకు దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం చెబుతున్నా సైట్ ఓపెన్ అవకపోవడంతో అధికారులు, దరఖాస్తుదారులు తలలు పట్టుకుంటున్నారు. నియోజకవర్గంలో 300లకు పైగా దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు చెబుతుండగా మిగిలిన వారు దరఖాస్తు చేసుకునేందుకు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు.

# ప్రకృతి సంపదపై పచ్చ గద్దల కన్ను

- యథేచ్ఛగా ఇసుక, మైనింగ్ అక్రమ రవాణా
- అధికార పార్టీ నేతల కనుసన్నల్లో దందా
- పట్టించుకోని మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖలు

కంచికచర్ల: ఎన్టీఆర్ జిల్లాలో కూటమి నేతలు ఆదాయ వనరులు సమకూర్చుకునేందుకు ప్రకృతి సంపదపై కన్నేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఇసుక దందాతో పాటు మైనింగ్ అక్రమ రవాణా యథేచ్ఛగా సాగిస్తున్నారు. ప్రకృతి సంపద కనిపిస్తే చాలు. అక్కడ గద్దలా వాలిపోయి దోచుకునేందుకు బాటలు వేసుకున్నారు. దీనికి తోడు అధికారులు కూటమి నాయకుల కనుసన్నల్లో పనిచేస్తుండటంతో వారి అక్రమాలను అడ్డూఅదుపు లేకుండా పోయింది.

**పేట్రేగిపోతున్న అక్రమార్కులు**

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇసుక లబ్ధిదారులకు అందుబాటులో ఉండేది. ధరలు కూడా అందుబాటులో ఉండటంతో వినియోగదారులు సకాలంలో ఇళ్లు నిర్మించుకునేవారు. ప్రస్తుతం అటువంటి పరిస్థితి కనిపించడం లేదు. డంపింగ్ యార్డుల వద్ద టన్ను ఇసుక రూ.350లు తీసుకుంటున్నారని లారీ యజమానులు ఆరోపిస్తున్నారు. అయితే చలానా తీసుకుంటే కేవలం రూ.150లు మాత్రమే కాని 20 టన్నుల ఇసుకను మాత్రమే లోడింగ్ చేస్తారు. అదే 40 టన్నుల ఇసుక లారీకి కావాల్సి వస్తే టన్ను రూ.350లు తీసుకుని లోడింగ్ చేస్తున్నారు. అంటే ఇసుక మాఫియా ప్రభుత్వానికి చెల్లించేది 40టన్నుల ఇసుకకు రూ.6వేలు మాత్రమే. మిగిలిన రూ. 8 వేలు నగదు వారి జేబుల్లోకి వెళుతోంది. నిన్న మొన్నటి వరకు ప్రభుత్వానికి చెల్లించాల్సిన చలానా లేకుండా విజయవాడ పార్లమెంట్ సభ్యుడి అనుచరులు ఒక్కో లారీకి రూ. 10వేలు ఇస్తే చాలు ఎన్ని టన్నులు అయినా లారీలకు నింపుతామని బహిరంగంగా చెప్పారు. జిల్లాలోని నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం నియోజకవర్గాల్లో ఇసుక రీచ్ నుంచి రోజుకు 200 నుంచి 300 లారీల వరకు ఇసుకను విక్రయిస్తున్నారు. వాటిలో కొన్ని లారీలు యథేచ్ఛగా ఇతర రాష్ట్రాలకు ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఉచిత ఇసుక పథకం చోటా నాయకులకు సైతం వరంగా మారింది.



కంచికచర్ల మండలం కీసరలో కూటమి మాఫియా డంపింగ్ చేసిన ఇసుక కుప్పలు



కంచికచర్ల మండలం దొనబండ రాతి క్వారీలో పేలుళ్లు

**క్వారీల్లో కంకర సైతం**

జిల్లాలో రాతి క్వారీల్లో అక్రమ తవ్వకాలు భారీగా జరుగుతున్నాయి. నందిగామ, మైలవరం నియోజకవర్గాల్లో దాదాపు 154 రాతి క్వారీలు, 97 క్రషర్లు ఉన్నాయి. కొన్ని క్వారీలకు మాత్రమే ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. ఆ అనుమతులను అడ్డం పెట్టుకుని మిగిలిన కొండను అక్రమంగా తవ్వి కంకర తీస్తున్నారు. కంకర తీసే సమయంలో బ్లాస్టింగ్ చేసేటప్పుడు కనీసం ప్రభుత్వ నిబంధనలు కూడా పాటించడం లేదు. నాసిరకం పేలుడు పదార్థాలు ఉపయోగించడంతో క్వారీల్లో పనిచేసే కార్మికులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. క్వారీల్లో అక్రమ తవ్వకాలు నిలుపుదల చేయకుండా మైనింగ్ శాఖ, రెవెన్యూ అధికారులు, పోలీసులు కూడా వాటి యజమానులకు వత్తాసు పలుకుతున్నారు.

**పక్క రాష్ట్రాలకు ఇసుక**



గత ప్రభుత్వంలో ఇసుక లబ్ధిదారులకు అందుబాటులో ఉండేది. సకాలంలో ఇళ్లు కట్టుకున్నారు. ఇసుక ధరలు కూడా సామాన్యుడికి అందుబాటులో ఉండేవి. నేడు అటువంటి పరిస్థితి లేదు. ఉచిత ఇసుక పేరుతో కూటమి నాయకులు దోచుకుంటున్నారు. పెద్ద పెద్ద లారీలతో ఇసుకను అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలించి అక్రమార్జనకు తెర తీశారు.

–రాయన నరసింహారావు, మున్నలూరు, కంచికచర్ల మండలం

**కార్మికుల ప్రాణాలు పోతున్నాయి**



క్వారీల్లో నాణ్యమైన పేలుడు పదార్థాలు వాడకపోవడం వల్ల పేలుళ్ల సమయంలో కార్మికులు ప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. క్వారీల్లో ఎక్కువగా ఇతర రాష్ట్రాలకు చెందిన కార్మికులు పనిచేస్తున్నారు. కార్మిక చట్టాలను అమలు చేయడం లేదు. అధికారులు కూడా చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

–కోట కళ్యాణ్, వ్యవసాయ, కార్మిక సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి

# విజృంభిస్తున్న విషజ్వరాలు

- రోగులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రులు
- పెనుగంచిప్రోలు పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ లేక ఇబ్బందులు

పెనుగంచిప్రోలు: మండలంలోని పలు గ్రామాల్లో విషజ్వరాలు ప్రజలను వెంటాడుతున్నాయి. జ్వరాలతో ప్రజలు ప్రభుత్వాసుపత్రితో పాటు ప్రైవేట్ ఆసుపత్రులకు, ఆర్ఎంపీల వద్దకు పరుగెడుతున్నారు. మండల కేంద్రం పెనుగంచిప్రోలులోని తుఫాన్ కాలనీలో ఈనెల 14వ తేదీన పెద్ది రూప అనే యువతి డెంగీ లక్షణాలతో మృతిచెందింది. ముఖ్యంగా టైఫాయిడ్‌తో పాటు వైరల్ జ్వరాలు ఉన్నట్లు వైద్య సిబ్బంది చెబుతున్నారు. పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రోజుకు 60 నుంచి 70 మంది రోగులు వస్తున్నారని తెలిపారు. వారిలో 8 నుంచి 10 మంది వరకు జ్వరాలతో వస్తున్నారని సిబ్బంది చెబుతున్నారు. అయితే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఎంతో కాలంగా ల్యాబ్ టెక్నీషియన్ లేరు. బూచవరం ఆరోగ్య కేంద్రం నుంచి వారంలో రెండు రోజులు మాత్రమే ల్యాబ్ టెక్నీషియన్ వస్తుందని ఆసుపత్రి వర్గాలు అంటున్నారు. గతంలో ఇద్దరు వైద్యులు ఉండగా వారు బదిలీపై వెళ్లడంతో జగ్గయ్యపేట నుంచి వైద్యాధికారి డిప్యూటేషన్‌పై వస్తున్నారు. ల్యాబ్ టెక్నీషియన్ రెగ్యులర్‌గా లేకపోవడంతో ప్రైవేటు ల్యాబ్‌ల వద్ద అధికంగా వసూలు చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. జ్వరాలపై గ్రామాల్లో ఇంటింటి సర్వే చేస్తున్నామని వైద్యాధికారి నాగలక్ష్మి పేర్కొన్నారు. ప్రముఖ యాత్రాస్థలంగా ఉన్న పెనుగంచిప్రోలు ఆసుపత్రికి తక్షణం రెగ్యులర్ వైద్యాధికారుల నియామకంతో పాటు ల్యాబ్ టెక్నీషియన్ నియమించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.



పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వేచి ఉన్న రోగులు

# పీఆర్సీని తక్షణమే ప్రకటించాలి

**సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాల్**

నందిగామ రూరల్: రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉద్యోగులతో పాటు లక్షలాది మంది ఒప్పంద కార్మికులు 12వ పీఆర్సీ కోసం ఎదురుచూస్తున్నారని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నందిగామ కమిటీ, సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం మున్సిపల్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 12వ పీఆర్సీని వెంటనే ప్రకటించాలని కోరుతూ ఈ నెల 18న మున్సిపల్ పట్టణాలు, 23న విజయవాడలో ధర్నా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. గత సమ్మె కాలం జీతాలను చెల్లిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం నెలలు గడుస్తున్నా నేటికీ చెల్లించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే పట్టణ జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని ధర్నా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు దాసవరపు సైదా, సలికేటి నరేష్, పుట్టా మాణిక్యం, రాజారత్నం, బేబి, రూతమ్మ, నాగరాజు, సతీష్ తదితరులు పాల్గొన్నారు.




నందిగామ మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

# న్యాయవాదులు విధుల బహిష్కరణ




పేటలో కోర్టు ముందు నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



నందిగామ కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

జగ్గయ్యపేట అర్బన్: న్యాయవాదుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించే విధంగా ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జారీ చేసిన సర్క్యులర్ నెం. 10/2025ను తీవ్రంగా నిరశిస్తూ జగ్గయ్యపేట బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ అన్యాయ పూరిత సర్క్యులర్‌ను హైకోర్టు తక్షణమే నిలుపుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపాగ సుందరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయవాదులు పసుపులేటి సత్య శ్రీనివాసరావు, ఆరేపల్లి వెంకటేశ్వర్లు, గోనెల వెంకటేశ్వర్లు, బూడిద నరసింహారావు, బసవరాజు, టీఎల్ నరసింహారావు, ఎం.ఆంజనేయులు, కె.శ్రీనివాసరావు, రావూరి ప్రసాద్, గంటా కృష్ణంరాజు, గురువులు రాజు, ప్రతాపరెడ్డి, ఎం.నరేష్, అంకమరాజు, కిషోర్, పల్లపు రవి, బిక్షమయ్య తదిరతులు పాల్గొన్నారు.

**సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలి**

నందిగామ టౌన్: హైకోర్టు జారీ చేసిన 10/2025 సర్క్యులర్‌ను వెంటనే రద్దు చేయాలని బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వరదబోయిన విజయ్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు గురువారం విధులు బహిష్కరించి స్థానిక కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మృతిచెందిన న్యాయవాదికి సంతాప సూచికంగా నిర్వహించే సంతాప కార్యక్రమాన్ని సాయంత్రం 4.15 గంటలకు నిర్వహించాలని జారీ చేసిన జీవోను తక్షణమే రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు యర్రంరెడ్డి బాబురావు, కన్నెకంటి జీవరత్నం, మన్నెం నారాయణరావు, బండి మల్లికార్జునరావు, యరగొర్ల రామారావు, అద్దంకి మణిబాబు, డేవిడ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

### రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

వీరులపాడు(జుజ్జూరు): ద్విచక్ర వాహనం అదుపుతప్పి కింద పడిపోవడంతో ఒక వ్యక్తికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు.. వీరులపాడు మండలం జుజ్జూరు గ్రామానికి చెందిన మోహన్ నరసింహారావు పాలెం గ్రామ సభలో ఉన్న రేకులు ఫ్యాక్టరీలో విధులు నిర్వహించేందుకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా గ్రామ శివారు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపు తప్పి కింద పడిపోయాడు. ఈ ఘటనలో మోహన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమీపంలో ఉన్న గ్రామస్తులు అతడిని 108లో నందిగామ ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు.

### స్థల యజమానిని బెదిరించిన వ్యక్తిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్థలయజమానిని బెదిరించిన వ్యక్తిపై విజయవాడ భవానీపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. చిట్టినగర్ కేటీ రోడ్డుకు చెందిన చుంచు నరసింహారావుకు విద్యాధరపురం లక్ష్మీనగర్‌లో ఖాళీ నివేశన స్థలం ఉంది. ఈనెల 16వ తేదీ తెల్లవారుజామున స్థలం ప్రహరీ గోడకు టి.రాజేష్‌నాయుడు పేరుతో బ్యానర్‌తోపాటు ఐరన్ కంటైనర్ ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో చుంచు నరసింహారావు తన స్థలం వద్ద ఏర్పాటు చేసిన బ్యానర్‌పై ఉన్న నంబర్‌కు ఫోన్ చేసి కంటైనర్‌ను తొలగించాలని రాజేష్‌నాయుడును కోరగా, ఐరన్ కంటైనర్ తీసేది లేదని, దిక్కున్నచోట చెప్పుకో అంటూ బెదిరించాడు. దీంతో నరసింహారావు భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

# ఆటోనగర్ కర్మాగారాల కాలుష్యాన్ని నివారించండి

జగ్గయ్యపేట అర్బన్: ఆటోనగర్ ప్రాంతంలోని కెమికల్ ప్లాంట్స్, ఫార్మా కంపెనీలు తదితర కర్మాగారాల వల్ల జగ్గయ్యపేట పట్టణంతో పాటు పరిసర ప్రాంతంలోని 5 కి.మీ పరిధిలో నీటి, వాయు కాలుష్యం ఏర్పడుతోందని తక్షణమే సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని జియాలజిస్ట్ ధరణికోట వెంకటరమణ, మందడపు శ్రీనివాసులు, గద్దెనాని తదితరులు పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురామ్‌కు కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ఆటోనగర్‌లోని కొన్ని ఫ్యాక్టరీల నుంచి వచ్చే కాలుష్యంతో ఆటోనగర్ సమీపంలో గల షేర్‌మహ్మద్‌పేట, తొర్రగుంటపాలెం, శాంతినగర్ తదితర ప్రాంతాలు కాలుష్యం అయ్యాయన్నారు. భూమిలోని నీరు, బోర్లలోని నీరు 100 అడుగుల పైగానే కలుషితమై యాసిడ్ బయటకు వస్తుందన్నారు. దగ్గరలోని పంటపొలాలు ఎందుకూ పనికిరాకుండా పోతున్నాయని, వాటిలోని పంటను ఉపయోగించడం వల్ల ఏ రోగాలు వస్తాయోనని బయపడే పరిస్థితులు ఏర్పడ్డాయని తెలిపారు. స్పందించిన రాఘురామ్ జిల్లా కలెక్టర్, పొల్యూషన్ బోర్డు చైర్మన్, ఆర్డీవో తదితర సంబంధిత అధికారులకు ఫోన్ చేసి మాట్లాడారు. వారం రోజుల్లో నివారణ చర్యలు చేపట్టాలని తెలియజేశారు. అలాగే శాశ్వత నివారణ జరిగే విధంగా ఆ ఫ్యాక్టరీలపై చర్యలు తీసుకోవాలని కోరారు.



రఘురామ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ధరణికోట రమణ తదితరులు

### ముగిసిన విశ్వకర్మ జయంతి వేడుకలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో రెండు రోజులుగా జరిగిన శ్రీమద్విరాట్ విశ్వకర్మ జయంతి వేడుకలు ముగిశాయి. శ్రీ మద్విరాట్ విశ్వకర్మ ఆలయంలో గురువారం విశ్వకర్మ దీక్షాధారణకు సంబంధించి యజ్ఞోత్సవం, మాల విరమణ చేసి ఇరుముడికి పూర్ణాహుతి జరిపారు. కార్యక్రమంలో శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్రస్వామి వారి 8వ తరం మనువడు శ్రీ మద్విరాట్ వీరంభట్లయ్య ముఖ్య అతిథిగా విచ్చేశారు. పూజా కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.



# ఎనిమిది ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం

చిల్లకల్లు(జగ్గయ్యపేట): మునేటి నుంచి అక్రమంగా తెలంగాణాకు ఇసుక తరలిస్తున్న ఎనిమిది ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ గురువారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మల్కాపురం గ్రామంలోని మునేటి నుంచి ఇసుకను ట్రాక్టర్ల ద్వారా తెలంగాణాకు తరలిస్తున్నట్లు బుధవారం అర్ధరాత్రి సమాచారం వచ్చిందన్నారు. దీంతో సిబ్బందితో వెళ్లి మునేటిలో దాడులు నిర్వహించి ఎనిమిది ఇసుక ట్రాక్టర్లు స్వాధీనం చేసుకున్నారు. ఎనిమిది మంది డ్రైవర్లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

### ఆంజనేయస్వామి ఆలయంలో చోరీ



జి.కొండూరు: మండల పరిధి మునగపాడు గ్రామంలో దక్షిణ ముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం రాత్రి చోరీ జరిగింది. ఇద్దరు దొంగలు గేటు తాళం పగలగొట్టి దేవాలయం లోపలికి చొరబడినట్లు దేవాలయంలో ఉన్న సీసీ కెమెరాలో రికార్డయింది. ఈ చోరీలో స్వామివారి వెండి శఠగోపురం, వెండి ప్లేటు, స్వామివారికి అలంకరించే వెండి కన్నును దొంగలు ఎత్తుకెళ్లారు. హుండీలో నగదును కానీ, బీరవాలో ఉన్న విలువైన వెండి వస్తువులను కానీ, బంగారపు సూత్రాలను కానీ దొంగలు ముట్టుకోలేదు. దొంగలు ఎత్తుకెళ్లిన వెండి వస్తువుల విలువ రూ.1లక్ష వరకు ఉంటుందని గ్రామస్తులు చెబుతున్నారు. స్వామివారికి పూజ చేసేందుకు గురువారం ఉదయం దేవాలయానికి వెళ్లిన పూజారి గేటు తాళం పగలగొట్టి ఉండటంతో పోలీసులకు సమాచారం అందించారు. సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. క్లూస్ టీం వచ్చి ఆధారాలను సేకరించారు. చోరీకి పాల్పడిన ఇద్దరు నిందితులలో ఒకరు చెప్పులు వేసుకొని గర్భాలయంలోకి వెళ్లడంతో అశుభంగా భావించి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. కాగా గతంలో కూడా ఇదే దేవాలయంలో చోరీ జరగడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# పోషకాహారంతోనే ఆరోగ్యం

పెనుగంచిప్రోలు: పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా తల్లులు, పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని అంగన్‌వాడీ కార్యకర్తలు సూచించారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా గురువారం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల బరువులు చూశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనం తీసుకునే ఆహారంలో నూనెలు, చక్కెర తగ్గించి వాడుకుంటే ఊబకాయం రాదని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సువర్చల, నాగమణి, రాజేశ్వరి, కల్పన, విమల, సునీత, మంజుల, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

**గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి**

చిల్లకల్లు(జగ్గయ్యపేట): గర్భిణులు ఆహారంలో జాగ్రత్తలు పాటించడంతోపాటు పౌష్టికాహారం తీసుకోవాలని బూచవరం ప్రభుత్వాసుపత్రి వైద్యురాలు కీర్తిరెడ్డి పేర్కొన్నారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయంలో స్వస్థ్ నారీ – సశక్త్ పరివార్‌లో భాగంగా గురువారం మహిళలకు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు మంచి ఆలోచనతో ఉల్లాసంగా ఉంటే సుఖ ప్రసవాలు జరుగుతాయని చెప్పారు. అనంతరం గర్భిణులకు ఐరన్ ట్యాబ్‌లెట్లు అందజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి శివాజీ, సూపర్‌వైజర్ నాగలక్ష్మి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, గర్భిణులు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

**గండేపల్లిలో..**

కంచికచర్ల: తల్లులు ఆరోగ్యంగా ఉంటేనే పుట్టిన బిడ్డలు కూడా ఆరోగ్యంగా ఉంటారని ఐసీడీఎస్ సీడీపీఓ లక్ష్మీ భార్గవి పేర్కొన్నారు. మండలంలోని గండేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం జాతీయ పోషణ్ మాసోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థూలకాయ నివారణకు చక్కెర, నూనెల వినియోగం తగ్గించాలని, పౌష్టికాహార సూచనలు పాటించాలని సూచించారు. గర్భిణులు, బాలింతలు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. జంక్ ఫుడ్ తినడం వల్ల అనారోగ్య సమస్యలు వస్తాయని చెప్పారు. పోషకాహార లోపం లేకుండా స్థూలకాయం రాకుండా చూసుకోవాలని తల్లులకు వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ కరీమాబీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నందిగామ రూరల్: మండలంలోని కేతవీరునిపాడు, మాగల్లుతో పాటు ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలపై సీడీపీవో లక్ష్మీభార్గవి అవగాహన కలిగించారు. వైద్యారోగ్య సిబ్బంది ఎప్పటికప్పుడు గర్భిణులు వైద్య సేవలు పొందేలా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌లు వెంకట్రావమ్మ, కరుణకుమారి, తారాభి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలులో చిన్నారుల బరువులు చూస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



చిల్లకల్లులో గర్భిణులకు ఐరన్ మాత్రలు అందజేస్తున్న వైద్య సిబ్బంది



గండేపల్లిలో గర్భిణీ, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ లక్ష్మీభార్గవి

### పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

తిరువూరు: మండలంలోని వావిలాలలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో గురువారం పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. గాలికుంటు వ్యాధి రాకుండా ముందస్తుగా ఈ టీకాలు వేస్తున్నామని పశువైద్యాధికారి అభిలాష్ తెలిపారు. వావిలాలలో 108 పశువులకు టీకాలు వేశామన్నారు. పశు యజమానులు తమ పశువులకు తప్పక వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని సూచించారు.